www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 04 | జూన్ | 2025
పేజీలు 8

## విపత్తు సమయంలో నష్టాల నివారణకు చర్యలు



-ప్రమాద హెచ్చరికలు గ్రామస్థాయి వరకు చేరాలి
-ప్రతి మండలంలో గజ ఈతగాళ్ల జాబితా సిద్ధం
-డిడిఎంపి సమావేశం నిర్వహించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

2 లో

# దేశానికే దిక్సూచిగా భూ భారతి

-డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క
-ఆగస్టు 15 నాటికి భూ సమస్యలకు పరిష్కారం
-ములుగుమాడులో భూ సర్వే ప్రారంభం
-పాల్గొన్న మంత్రులు పొంగులేటి, తుమ్మల





**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** దేశానికే తలమానికంగా భూ భారతి రెవెన్యూ చట్టాన్ని ప్రజా ప్రభుత్వం రూపొందించిందని, పేద ప్రజలకు చుట్టంగా భూ భారతి చట్టం పనిచేస్తుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఎర్రుపాలెం మండలం మొలుగు మాడు గ్రామంలో భూ భారతి సర్వే, రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల కార్యక్రమాన్ని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్ఎ నవీన్ మిట్టల్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమీషనర్ డాక్టర్ జ్యోతిబుద్ధ ప్రకాశ్, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌లతో కలిసి ప్రారంభించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ నక్షాలు లేకుండా మన రాష్ట్రంలో 413 గ్రామాల్లో దశాబ్దాల కాలంగా

మిగతా 2లో..

## భూ భారతి పరిష్కారం చూపేనా..?



-ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు
-గ్రామ గ్రామాన దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** భూమికి విలువ పెరగడం దానికి మించి భూమి వ్యాపార వస్తువుగా మారడంతో భూ సమస్యలు పెరిగాయి ఒకప్పుడు గ్రామాలకే పరిమితమై సాధారణ విషయంగా ఉన్న భూ సమస్య ఇప్పుడు రాష్ట్రాల్లో ప్రధాన సమస్యగా మారింది. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యనించినట్లుగా ఇది ఎన్నికల్లో ప్రధాన చర్చనీయాంశంగా ప్రభావిత అంశంగా మారింది. ధరణి కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఎన్నికలకు ముందే కాంగ్రెస్ మేము అధికారంలోకి వస్తే ధరణిని

మిగతా 2లో..

## స్మగ్లర్ల పాలవుతున్న సన్న బియ్యం..!



-మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడంతో పండగ చేసుకుంటున్న రేషన్ స్మగ్లర్లు
-సత్తుపల్లిలో దత్తు గ్యాంగ్, నెల్లూరు గ్యాంగ్ హవా..

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పేదల బతుకులు మార్చాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న సన్న బియ్యం స్మగ్లర్ల పాలవుతుంది. మూడు నెలలకు సరిపడా, ఒకేసారి బియ్యం పంపిణీ జరుగుతుండడంతో స్మగ్లర్లకు పంట పండింది. గతంలో రూ.15 ధర పలికిన బియ్యం నేడు రూ. 20 నుండి రూ.25 ధర పలుకుతుండటంతో పేదల సైతం డబ్బుకు ఆశపడి సన్నబియాన్ని దళారుల పాలు చేస్తున్నారు. గతంలో దొడ్డు బియ్యం రేషన్ షాపుల ద్వారా అందినప్పుడు దళారులు పాలైంది. దొడ్డు బియ్యం వ్యాపారం చేసిన స్మగ్లర్లు కోట్లకు పడగలెత్తారు. నేడు సన్న బియ్యం సైతం స్మగ్లర్ల పాలవుతుండటం పలు అనుమానాలకు తావిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పోర్టిఫైడ్ కలిపిన ఆరోగ్యవంతమైన సన్నబియ్యాన్ని పేదలకు అందిస్తుండగా, అధిక డబ్బులు ఆశ చూపి పేదల కడుపు కొడుతున్నారు రేషన్ స్మగ్లర్లు.

### దత్తు, నెల్లూరు గ్యాంగ్ హవా...

సన్న బియ్యం కొనుగోళ్ళలో చింతలపూడి మండలానికి చెందిన దత్తు, సత్తుపల్లి మండలంలో నివాసం ఉంటున్న నెల్లూరు గ్యాంగ్ హవా కొనసాగుతుండడం విశేషం. వేంసూరు మండలం భీమవరం, దుద్దెపూడి, కందుకూరు, మర్లపాడు గ్రామాలకు చెందిన చిరు వ్యాపారులు సమయాన్ని సేకరించి ఆంధ్ర స్మగ్లర్లకు అందిస్తున్నారు. అదే విధంగా సత్తుపల్లి మండలంలోని సిద్ధారం, రాజీవ్ నగర్ కాలనీ, కాకర్లపల్లి, సత్తుపల్లి పట్టణం, రేజర్ల, సదాశివుని పాలెం గ్రామాలకు చెందిన చిరు వ్యాపారులు పేదల నుండి సేకరించిన బియ్యాన్ని మామిడి, పామాయిల్ తోటలలో

మిగతా 2లో..

# దేశానికే దిక్సూచిగా భూ భారతి

(మొదటిపేజీ తరువాయి)

పాలన సాగుతోందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కష్టాలు పడుతున్నారని, భూ భారతి చట్టం ద్వారా 413 గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు సర్వే చేయించి సరిహద్దులను నిర్ణయించి ఇబ్బందులు లేకుండా చేయాలని పైలెట్ ప్రాజెక్టు కింద మొలుగుమాడు గ్రామాన్ని ఎంపిక చేశామని తెలిపారు. దేశ చరిత్రలో చాలా అరుదుగా భూ భారతి వంటి అద్భుతమైన చట్టాలు వస్తాయని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తెలంగాణ టెనెన్సీ యాక్ట్ 1950 ద్వారా పేదలకు భూ హక్కులను కల్పించామని, 1971 ఆర్వోఆర్ చట్టం, 1973భూ సంస్కఅణల కారణంగా రైతులకు చాలా మేలు జరిగిందని, ఈ చట్టాల కారణంగా భూమి లేని నిరుపేదలకు మిగులు భూమి పంపిణీ చేసి వారికి గౌరవం కల్పించామని అన్నారు. 2020 సంవత్సరంలో వచ్చిన ధరణి చట్టం వల్ల అనేక సమస్యలు వచ్చాయని, భూమి హక్కులు లేకపోయినా అదనంగా పాస్ పుస్తకాలు అందించడం, గత చట్టాల వల్ల వచ్చిన భూ హక్కులను కాల రాస్తూ మరొకరి పేరు మీద భూములు ఎక్కించడం వంటి అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయని అన్నారు. మార్పులు, చేర్పులు చేసేందుకు రెవెన్యూ వ్యవస్థలో ఎటువంటి అవకాశం లేకుండా గత ప్రభుత్వం చట్టం తీసుకుని వచ్చిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ఉపయోగపడే విధంగా అందరి సలహాలు స్వీకరించి భూ భారతి చట్టం తీసుకుని వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో భూమి సుంకం చెల్లించే సమయంలో రైతుల తమ పేరిట భూములు ఉన్నాయని, వివరాలు చెక్ చేసుకునే సౌలభ్యం ఉండేదని, ధరణి చట్టం వల్ల అటువంటి అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. భూభారతి చట్టం ప్రకారం ప్రతి సంవత్సరం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ అమ్మకాలు, కొనుగోలు వివరాలు అప్‌డేట్ చేస్తూ భూ రికార్డులను మాన్యువల్‌గా రాసి పంచాయతీ కార్యాలయంలో అతికించడం జరగుతుందని అన్నారు. . భవిష్యత్‌లో అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేసి మిగులు భూములను ఇంటి పట్టాల పంపిణీ, భూ పంపిణీ కార్యక్రమాన్ని తిరిగి ప్రవేశ పెడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ అధికారుల దగ్గరే పరిష్కరించుకునేలా అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ..**

పట్టాపాస్ పుస్తకాల్లో ఉన్న తప్పుల కారణంగా రైతులు చాలా ఆందోళనకు గురవుతున్నారని, గ్రామంలో ఉన్న తక్కువ విస్తీర్ణం భూమికి కూడా కొన్ని చోట్ల పట్టాల్లో వేల ఎకరాలు ఉన్నట్లు ఉందని, దీని వల్ల ప్రభుత్వంపై కూడా భారం పడుతుందని తెలిపారు. భూముల ధరలు పెరిగిపోవడం వల్ల అన్నదమ్ములు, స్నేహితుల మధ్య కూడా గొడవలు జరిగి హత్యల వరకు దారి తీస్తున్నాయని, వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని అన్నారు. రోడ్లు విశాలంగా ఉంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, రోడ్డు విస్తరణ కోసం ప్రజలు ముందుకు రావాలని మంత్రి తెలిపారు. దేశానికే తలమానికంగా భూభారతి చట్టం మన జిల్లాలో అమలు చేయడం జరగుతుందని అన్నారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ...**


ప్రజల అభిలాష మేరకు ప్రభుత్వం పాలన అందించాలనే లక్ష్యంతో గత పాలకులు ప్రజలపై రుద్దిన ధరణి చట్టం వల్ల రైతులు ఆసాములు పడిన ఇబ్బందులు తొలగించాలని సిఎం రేవత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం 18 రాష్ట్రాల్లోని రెవెన్యూ చట్టాలను స్టడీ చేసి భూ భారతి చట్టం ఏప్రిల్ 14న ప్రవేశపెట్టిందని అన్నారు. భూ భారతి చట్టం అమలు ప్రజలపై ఎటువంటి ప్రభావం ఉంటుందో గమనించాలని ముందస్తుగా నాలుగు మండలాలను రెండు విడతల్లో ప్రతి జిల్లాలో ఒక మండలం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకుని రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 3 నుంచి జూన్ 20 వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో తహశీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ బృందం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మంత్రి తెలిపారు. ప్రైవేట్ వ్యవస్థల్లో మొదటి విడత కింద రాష్ట్రంలో 6వేల మంది సర్వేయర్లకు శిక్షణ అందించి వారికి లైసెన్స్ జారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఒక రెవెన్యూ అధికారి ఉండే విధంగా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 3వేల 556మంది రెవెన్యూ అధికారులను రాబోయే నాలుగు రోజుల్లో నియమిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జెడి ప్రసన్నలక్ష్మి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ యాకుబ్, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్‌డిఓ నర్సింహారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాసులు, ఎర్రుపాలెం తహశీల్దార్ ఉషాశారద, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి పరిష్కారం చూపేనా..?

(మొదటిపేజీ తరువాయి)

బంగాళాఖాతంలో కలిపేస్తామంటూ హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చింది. భూ భారతికి సంబంధించి పైలెట్ ప్రాజెక్టు క్రింద రాష్ట్రంలో నాలుగు మండలాలను ఎంపిక చేసి రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని మదింపు చేసిన తర్వాత రెండవ విడతగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుజాతనగర్, ఖమ్మంజిల్లాలోని బోనకల్ మండలాల్లో కూడా భూ భారతి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుల్లో ఎక్కువ భాగం సాదా బైనామా నుండి పట్టాదారు పాసుపుస్తకాల కొరకు వచ్చినవి ఉండగా మిగిలినవి విస్తీర్ణంలో ఉన్న లోపాలు, పేర్లలో జరిగిన పొరపాట్లు ఉండగా అన్నింటికి మించి అసైన్‌మెంట్ భూముల సమస్య ప్రధానంగా ఉంది. రెవెన్యూ గ్రామాల్లో అనేక దశాబ్దాలుగా భూ సర్వే జరగకపోవడంతో చాలా సమస్యలు ఉత్పన్నమయ్యాయి. భూ రికార్డుల్లో ఉన్న భూమికి వాస్తవ సాగులో ఉన్న భూ విస్తీర్ణానికి మధ్య చాలా తేడాలున్నాయి. ధరణిలో ఇచ్చిన పాసు పుస్తకాల ప్రకారం రెవెన్యూ గ్రామంలో ఉన్న మొత్తం భూ విస్తీర్ణం కంటే పాసుపుస్తకాల్లో ప్రాతిపదికన భూ విస్తీర్ణం చాలా ఎక్కువగా ఉంది. అప్పటి విఆర్‌వోలు, విఆర్‌ఏలు ఇష్టానుసారంగా పాసుపుస్తకాల్లో భూ విస్తీర్ణాన్ని నమోదు చేశారు. ఓ రైతుకు రెండున్నర ఎకరాలు ఉంటే అప్పట్లో రైతుబంధు పడుతుందన్న ఆత్యాశతో కొంత మంది తమ పాసుపుస్తకాల్లో అదనపు భూమిని చేర్చుకున్నారు. ఇక భూ వివాదాలు సరే సరి. ఒకే భూమికి సంబంధించి ఇద్దరికి పాసుపుస్తకాలు ఇవ్వడం పాసుపుస్తకాల విస్తీర్ణం ప్రకారం భూమి లేకపోవడం సమస్యలు ఉన్నాయి. అన్నింటికి మించి ధరణిలో ఉన్న ప్రధాన లోపాన్ని భూ భారతి సరి చేస్తుందా అన్నది ప్రధాన చర్చగా మారింది. ప్రజా ఉపయోగార్థం ప్రభుత్వం భూమిని సేకరించినప్పుడు సేకరించిన భూమి పోగా మిగిలిన భూమికి ధరణిలో సంబంధిత రైతుకు హక్కు కల్పించబడలేదు. రోడ్లు, కాలువలు, ప్రాజెక్టుల సమయంలో ప్రభుత్వ భూ సేకరణ తర్వాత మిగిలిన భూమికి హక్కు దక్కలేదు. ఖమ్మంజిల్లాలో నాగార్జున సాగర్ కాలువలతో పాటు హైవేలు ఇతర రోడ్ల కోసం సేకరించిన భూమికి హక్కు దక్కని రైతులు వేల సంఖ్యలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇక రెండవ ప్రధాన సమస్య అసైన్‌మెంట్ భూములు. 1970లో అప్పటి కేంద్ర ప్రభుత్వం 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, బంజరు, అసైన్డ్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ భూములను పేదలకు పంపిణీ చేసింది. ఇప్పుడు చాలా చోట్ల ఆ భూములు చాలా విలువైన భూములుగా మారాయి. పేదల దగ్గర పలువురు కొనుగోలు చేసి పరిశ్రమలు ఏర్పాటు చేయగా మరికొన్ని చోట్ల ఇతరత్రా వినియోగంలోకి తీసుకు వచ్చారు. కానీ ఇందులో ఆనాటి నుంచి ఈనాటి వరకు ఆ భూములను సాగు చేసుకుంటున్న వాస్తవ రైతులకు హక్కు కల్పించబడలేదు. ఇటీవల ఖమ్మంలో భూ భారతిపై జరిగిన సమీక్ష సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసైన్‌మెంట్ భూముల్లోనూ వాస్తవ సాగుదారులుగా ఉన్న వారికి పట్టాలు ఇస్తామని ప్రకటించారు. దానిని అమలు చేయగలిగితే భూ భారతి సత్ ఫలితాన్ని ఇచ్చినట్లే. కానీ దరఖాస్తులు స్వీకరించి అందులో ఉన్న లోపాలను సరిదిద్దడంతో పాటు ధరణిలో హక్కు పొందలేని రైతులకు హక్కు కల్పించడం అసైన్‌మెంట్ సాగులో ఉన్న నిరుపేద రైతులకు హక్కులు కల్పించ గలిగితే భూ భారతి రైతుల పాలిట వరంగా మారుతుంది. లేదంటే మరల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లు అరిగేలా తిరగాల్సి వస్తుంది. ప్రభుత్వానికి ఆశించిన ఫలితం దక్కక పోవచ్చు.

# స్మగ్లర్ల పాలవుతున్న సన్న బియ్యం..!



(మొదటిపేజీ తరువాయి)

డంప్ చేస్తారు. అక్కడ నుండి చీకటి పడగానే అశోక్ లేలాండ్, ఐషర్, బొలెరో లాంటి వాహనాలలో ఆంధ్ర వ్యాపారులకు తరలిస్తున్నారు.

**సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో భయం లేదు...**

అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్న ఆంద్ర స్మగ్లర్లు ద్విచక్ర వాహనాలు కలిగిన వారిని బియ్యం సేకరించడానికి ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరికి కేజీకి రూ.5 నుండి, రూ. 6 లాభం అందిస్తుండటమే కాకుండా సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని అధికారులకు మంత్లీలు అందిస్తున్నామని, ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, మీ వద్దకు ఏ అధికారి రాడని అంతా మేం చూసుకుంటామని భరోసా కల్పిస్తున్నట్లు గుస, గుసలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో తెలంగాణలోని సన్నబియాన్ని సేకరించడానికి చింతలపూడి మండల కేంద్రంలో స్మగ్లర్లు సమావేశం ఏర్పడినట్లు సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు చక్కెర్లు కొట్టాయి. తెలంగాణలో పేదలకు అందిస్తున్న సన్న బియ్యం రైస్ మిల్లర్లకు ఓ వరంగా మారిందని, రైస్ మిల్లర్లు నేరుగా బియ్యాన్ని కొనుగోలు చేయకుండా ఆంధ్ర స్మగ్లర్లతో చేతులు కలిపి, పేదలకు అందుతున్న సన్నబియాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**అధికారులు జూలు విదల్చాల్సిందే...**

అధికారులకు మంత్లీలు అందిస్తున్నామంటూ స్మగ్లర్లు చేస్తున్న చవక బారు ఆరోపణలను తిప్పి కొట్టాలంటే అధికారులు అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై కొరడా ఝళిపించి, జూలు విధుల్చాలని, పేదల నుండి సన్న బియ్యం సేకరిస్తున్న ప్రతి ఒక్కరి ఆట కట్టించటంతో పాటు, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం అమ్ముకుంటున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయపడుతున్నారు.

# విపత్తు సమయంలో నష్టాల నివారణకు చర్యలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విపత్తు సమయంలో నష్టాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో విపత్తుల నిర్వహణపై ఏర్పాటు చేసిన జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (డిడిఎంపి) సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది వరదల కారణంగా ప్రభావితమైన ప్రాంతాలను ఎంపిడివోలు మండలాల వారీగా, పట్టణాలు, నగరాల్లో మున్సిపల్ కమిషనర్లు గుర్తించి అక్కడ ప్రస్తుత క్షేత్ర స్థాయి పరిస్థితులు పరిశీలించి రిపోర్టు అందజేయాలన్నారు. జూన్ 15 నుంచి మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్ష వివరాలను కూడా ట్రాక్ చేస్తూ నది ప్రవాహాల వివరాలను వాట్సాప్ గ్రూపుల ద్వారా జిల్లా అధికారులకు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. వర్షాల ఉధృతి వివరాలు సేకరించి వాటి ఆధారంగా ముఖ్యప్రణాళికాధికారి ప్రమాద హెచ్చరికలు జారీ చేయాలన్నారు. వరద ఉధృతి మేరకు ముఖ్య ప్రణాళికాధికారి ఇచ్చే హెచ్చరిక ప్రకారం ప్రభావితమయ్యే సంబంధిత ప్రాంతాల అధికారులు అప్రమత్తం కావాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలించేందుకు పకడ్బందీ వ్యవస్థ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రమాద హెచ్చరికలు ఎప్పటికప్పుడు గ్రామస్థాయికి చేరుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, ఆపదమిత్రలు గ్రామ గ్రూపులలో ఉండాలన్నారు. జిల్లాలో 300 మంది ఆపదమిత్రలకు విపత్త నిర్వహణ నిమిత్తం 12 రోజులు శిక్షణ అందించామన్నారు. ప్రతి మండల కేంద్రంలో విపత్తు నిర్వహణ మేనేజ్‌మెంట్ ప్రణాళిక రూపకల్పనపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం గురువారం నిర్వహించాలన్నారు. శుక్రవారం గ్రామాల్లో పర్యటించి వల్నరబుల్ ప్రాంతాలు, కూలిపోవడానికి దగ్గరగా ఉన్న ఇండ్లు, ఒంటరి మహిళలు, వృద్దులు లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. సిపి సునీల్ దత్ మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలకు తక్షణ స్పందన, సహాయం రెవెన్యూ శాఖ నుంచి వస్తుందని అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాల సంరక్షణకు పోలీస్ అధికారులు సైతం పూర్తి స్థాయిలో కృషి చేస్తారని తెలిపారు. పోలీస్ శాఖాధికారులు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ వరదలు, ఇతర విపత్తుల సమయంలో నష్టాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఖమ్మం నగరంలో 12 డివిజన్లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అక్కడ నష్ట నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి వార్డులో 20 మంది వాలెంటీర్లను గుర్తించి విపత్తు నిర్వహణ శిక్షణ అందించామని తెలిపారు. రిలీఫ్ సెంటర్‌లను గుర్తించి అక్కడ మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా అధికారులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం, ఏఎస్ఐ మద్దిలేటి, హెడ్ కానిస్టేబుల్స్ జగదీష్, సురేష్‌కుమార్, కానిస్టేబుల్స్ రియాజుద్దీన్, కె. జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టివి చౌదరి వర్ధంతి




**ప్రజాపక్షం/ఇల్లెందు:** పట్టణంలోని విఠల్‌రావు రాజ్ భవన్‌లో రాష్ట్ర వ్యవసాయ సంఘం నాయకుడు టీవీ చౌదరి ఆరవ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య మాట్లాడుతూ రైతుసంఘం నాయకుడిగా, సీపీఐ రైతులకు విశేషమైన సేవలు అందించారని గుర్తు చేశారు. 14సంవత్సరాలు సీపీఐ జిల్లా కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి, అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవర కొండ శంకర్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాస శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, ఏఐటీయూసీ శాఖ ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, బొల్లి కొమరయ్య, నెల్లి కొమరయ్య, షేకక్ వలీ తదితరులు పాల్గొన్నారు.

# మహోన్నత ఆశయంతో ఇందిరా డైరీ ఏర్పాటు

**- డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క**





**ప్రజాపక్షం/ మధిర :** ఇందిరా డైరీ నియోజకవర్గంలో గొప్ప ఆశయంతో చేపట్టిన మహోన్నత కార్యక్రమని, అధికారులు మనస్ఫూర్తిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మధిర క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, వెలుగు, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరా డైరీ పథకంలో ప్రతి లబ్ధిదారునికి రెండు గేదెలు అందచేయాలని, సభ్యులు ఎటువంటి కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కాంట్రిబ్యూషన్‌కు సంబంధించిన సభ్యులకు అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఇందిరా డైరీ సభ్యులకు భూమి ఉండాలన్న నిబంధన ఏదీ లేదని, అసలు గేదెలు లేని వారికి ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రానున్న ఐదు నెలల్లోపు నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తిస్థాయిలో ఇందిరా డైరీ పథకం ప్రారంభం కావాలని, పనులు వేగవంతం చేసేందుకు గేదెల కొనుగోలుకు పెద్ద సంఖ్యలో అధికారుల బృందాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్‌ను ఆదేశించారు. గేదెల కొనుగోలు బృందంలో తప్పనిసరిగా ఒక విజిలెన్స్ అధికారి ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న గేదెలు, కొత్తగా రాబోతున్న గేదెల వాటికి అవసరమైన పచ్చి గడ్డి, ఎండు గడ్డి వివరాలపై సమీక్ష నిర్వహించారు. పెద్ద సంఖ్యలో గడ్డి అవసరం ఉన్న నేపథ్యంలో నిరుద్యోగులకు గడ్డి సరఫరాకు అవసరమైన అన్ని సహాయ చర్యలు చేపట్టి వారికి ఉపాధితో పాటు పెద్ద సంఖ్యలో వస్తున్న గేదెలకు గడ్డిని సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ సమావేశంలో వివిధ హోదాల్లోని అధికారులు పాల్గొన్నారు.

# సిపిఐలో పలు కుటుంబాలు చేరిక

**- పార్టీ కండువలను కప్పి ఆహ్వానించిన సిపిఐ నేతలు మౌలానా, దండి**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని గొల్లగూడెనికి చెందిన బిఆర్ఎస్, సిపిఎం నుంచి పలు కుటుంబాలు మంగళవారం సిపిఐ పార్టీలో చేరాయి. వీరికి సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ పార్టీ కండువలను కప్పి సాధరంగా ఆహ్వానించారు. అలాగే తాళ్లేసితండాశాఖ మహాసభను ధరావత్ కృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. దీనికి సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రసగించారు. అనంతరం సిపిఐ శాఖ, మహిళ సమాఖ్య, ఏఐవైఎఫ్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, రైతు సంఘం నాయకులు వెంపటి సురేందర్, దండి రంగారావు, చిదుముల బాబురెడ్డి, ధరావత్ లచ్చు, బాధావత్ రాందాస్, ధరావత్ భద్రునాయక్, రాము, బోడ నరసింహా తదితరలు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

**-వివిపాలెం, కోయచలకలో గ్రామసభలు**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని రఘునాథపాలెం తహసీల్దార్ ఎస్. శ్వేత తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టానికి సంబంధించి ప్రభుత్వం మంగళవారం నుంచి గ్రామ సభల నిర్వహణకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రఘునాథపాలెం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం, కోయచలక గ్రామాల్లో భూ భారతి చట్టంపై గ్రామసభలు నిర్వహించారు. వి.వెంకటాయపాలెం గ్రామంలో తహసీల్దార్ శ్వేత ఆధ్వర్యంలో, కోయచలక గ్రామంలో నయాబ్ తహసీల్దార్ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వి. వెంకటాయపాలెం గ్రామసభలో తహసీల్దార్ శ్వేత మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. గతంలో ధరణి చట్టంలో పరిష్కారం కానీ పలు భూ సమస్యలకు భూ భారతి చట్టంలో పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సర్వే నెంబర్ల తప్పు, భూమి హెచ్చుతగ్గులు, రికార్డులో తప్పుల నమోదు, ఇతరత్రా సమస్యలను ఈ చట్టంలో పరిష్కరించుకునేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. గ్రామసభల్లో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించి ఇచ్చిన వారికి రశీదులు ఇస్తున్నామన్నారు. గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు అందించాలని ఆమె తెలిపారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి వల్ల పలువురు రైతులకు భూ సమస్యలు పరిష్కారం కాలేదని వాటన్నింటికి భూ భారతిలో పరిష్కరించేందుకు అవకాశం కల్పించారన్నారు. గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టిందన్నారు. వి. వెంకటాయపాలెంలో 129, కోయచలకలో 65 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ప్రవీణ్, సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వి.వెంకటాయపాలెం గ్రామ సభలో పలువురు గజాల్లో స్థలాలు విక్రయించి మరల పాసుపుస్తకాల కోసం, పలువురు గతంలో పొలం విక్రయించి రిజిస్ట్రేషన్ కాకుండా అగ్రిమెంట్ పైనే ఆగిపోయిన పలు భూములకు సంబంధించి దరఖాస్తు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. దీనిపై అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# దారా బాలరాజు కుటుంబానికి పరామర్శ




**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు ఇటీవల గుండెపోటుతో అకాల మృతి చెందిన సంగతి విధితమే. మంగళవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి దారా బాలరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దారా బాలరాజు అకాల మృతి పార్టీకి తీరని లోటన్నారు. దారా బాలరాజు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ జిల్లానాయకులు డాక్టర్ కోట రాంబాబు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, యన్నం కోటేశ్వరరావు, కటికల సీతారామిరెడ్డి, నిడమానూరు వంశీ, అద్దంకి రవి, కర్నాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లులో గల రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు మంగళవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన నాణ్యమైన విత్తనంరైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా అందించారు. దీనికి మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యి అందజేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి వ్యవసాయ సంచాలకులు సరిత, పాలేరునియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ మురళి, రంగారావు, మహేష్, మండల వ్యవసాయ అధికారి జె.ఉమానగేష్, వ్యవసాయ విస్తరణధికారులు వంశీ, ఆదర్శ్, కావ్య, హిమబిందు తదితరలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల చిన్నారి మృతి

**- నివాళులర్పించిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** రోడ్డు ప్రమాదంలో నాలుగేండ్ల చిన్నారి కోసూరి బృంద మృతి చెందిన సంఘటన ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంక్రాస్‌రోడ్ వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన కోసూరి అప్పారావు తన మిత్రుడి ఆటోల ఏదులాపురం నుంచి వరంగల్‌క్రాస్‌రోడ్ తన కూతురిని తీసుకుని వస్తున్నాడు. ఈ నేపథ్యంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోని బలంగా ఢీకొట్టడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెంది. కాగా మరణ వార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో ఉన్న చిన్నారి మృతదేహాన్ని సందర్శించి భావోద్వేగానికి గురయ్యారు. అలాగే తీవ్ర దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులను ఓదార్చారు. చిన్నారి మృతితో వారు నివాసం ఉంటున్న ప్రాంతం శోకసంద్రంలో మునిగిపోయింది. ముక్కు పచ్చలారని చిన్నారి మృతిపై పలువురు సైతం కంటతడి పెట్టుకున్నారు.

# వార్డు విభజనలో అభ్యంతరాలు ఉంటే తెలపండి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** వార్డు విభజనలలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్న తెలపాలని కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం పెద్దతండలోని ఏదులాపురంమున్సిపాలిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు...32 డివిజన్లతో డ్రాఫ్ట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిపై అభ్యంతరాలను ఐదురోజులలో కార్యాలయంలో తెలవచ్చునన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేయబోయే వార్డుల విభజనకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులు వద్దని ఆందోళన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మా గ్రామంలో బెల్ట్ వద్దంటూ సత్తుపల్లి నియోజకవర్గంలోని, వేంసూరు మండలం, శంభునిగూడెం గ్రామస్థులు సత్తుపల్లి పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ముందు సోమవారం ఆందోళన నిర్వహించి, ఎక్సైజ్ ఎస్.ఐ శేఖర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంభునిగూడెం గ్రామంలో చిల్లర దుకాణాలు, కూల్ డ్రింక్ షాప్ ల పేరుతో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారని, బెల్ట్ షాపులలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు రాత్రి, పగలు తేడా లేకుండా దొరుకుతుండటంతో యువత పెడదారి పట్టడమే కాకుండా కుటుంబాలను చిన్నా,భిన్నం అవుతున్నాయన్నారు. చిన్న,పెద్ద తేడా లేకుండా మద్యం అమ్మకాలు జరుపుతుండటంతో చిన్నపిల్లలు మద్యానికి భానిసలుగా మారుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే శంభునిగూడెంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి, తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వేంసూరు మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్, సత్తుపల్లి పట్టణ సీపీఎం కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, తిరుపతమ్మ, సావిత్రి, కాసు, రాధ, మారేశ్వరమ్మ, పద్మ, రమణ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

### -దశల వారీగా లబ్ధిదారులకు నగదు జమ





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి రఘునాథపాలెం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మల్లెపల్లి గ్రామ పంచాయతీలో నిర్మాణాలు శర వేగంగా సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో పేదలు సొంత గూటి కోసం ఎదురు చూశారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం చేపడతామని చెప్పిన ప్రభుత్వం అరకొరగా నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్థలం ఉండి ఇల్లు లేని వారికి ఐదు లక్షల రూపాయలు అందించి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపింది. అందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపికైన మల్లేపల్లి గ్రామ పంచాయతీలో మొత్తం 13 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా వారిలో ముగ్గురు ఇంటి నిర్మాణానికి సుముఖత వ్యక్తం చేయలేదు. మిగిలిన 10 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టారు. అందులో ఇద్దరు లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి నిర్మాణం స్లాబు వరకు వచ్చింది. మరి కొంత మంది బేస్‌మెంట్ పూర్తి చేసి లెంటల్ నిర్మాణం చేపట్టారు. ఒక లబ్ధిదారుడు బేస్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం దశల వారీగా నిధులను లబ్దిదారులకు అందజేస్తుంది. ఇద్దరు లబ్దిదారులు నాగమణి, ఉపేందర్ లకు రెండు లక్షల మేర నగదును వారి ఖాతాల్లో జమ చేసింది. మరో ఏడుగురు లబ్దిదారులకు బేస్‌మెంట్ పూర్తి కావడంతో లక్ష చొప్పున నగదు జమ చేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు 400 నుంచి 600 అడుగుల మేర ఇంటి నిర్మాణం చేపట్టాలని తెలపడంతో దానికి అనుగుణంగా లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టారు. అధికారులు నిర్మాణాలను పర్యవేక్షిస్తూ లబ్దిదారులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయం వద్ద నమూనా ఇంటిని అధికారులు నిర్మించారు. ఎంపికైన లబ్దిదారులు ఆ ఇంటిని పరిశీలించి దానికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపట్టారు.

**లబ్దిదారులకు సూచనలు, సలహాలు : హౌజింగ్ ఏఈ పుష్ప**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి లబ్దిదారులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందిస్తున్నామని హౌజింగ్ ఏఈ పుష్ప తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మల్లేపల్లి గ్రామ పంచాయతీలో ఇండ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. లబ్దిదారులు కూడా ఇంటి నిర్మాణాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు కట్టుకుంటున్నారని తెలిపారు. దశల వారీగా వారి ఖాతాల్లోకి నగదు కూడా జమ చేస్తున్నట్లు తెలిపారు. రఘునాథపాలెం మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇప్పటి వరకు సుమారు 1303 మంది లబ్దిదారులను గుర్తించామని త్వరలో తుదిజాబితా ప్రకటించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

**లబ్దిదారుల్లో ఆనందం : మాజీ సర్పంచ్ బండి వెంకన్న**

ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని గత ప్రభుత్వంలో సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఎదురు చూశారని అయిన ఫలితం దక్కలేదని మాజీ సర్పంచ్ బండి వెంకన్న తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పైలెట్ ప్రాజెక్టు క్రింద మల్లేపల్లి గ్రామ పంచాయతీని ఎంపిక చేశారని మొత్తం 13 మంది లబ్దిదారులను గుర్తించారన్నారు. వారిలో ముగ్గురు ఇంటి నిర్మాణానికి ముందుకు రాలేదని మిగిలిన 10 మంది లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టారన్నారు. ప్రభుత్వం చెప్పిన విధంగా నిధులు కూడా లబ్దిదారుల ఖాతాల్లోకి దశల వారీగా అందజేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల హామీని నెరవేర్చడంతో లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

# ఉపాధిలో కూలీల కష్టాలు..!



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని 23 గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ కూలీలకు కూలి అందక గత 40 రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నట్లు కూలీలు తెలుపుతున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో కూడా ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనాలు నుంచి పెండింగ్ ఉండటంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని పేరువంచ, వెన్నవల్లి, లింగాల, చెన్నూరు, చిన్న కోరుకొండి, ముచ్చవరం, పెద్ద కోరుకొండి, లక్ష్మీ పురం, బత్తుల పల్లి, ముగ్గ వెంకటాపురం తదితర గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు గత 40 రోజుల నుంచి రోజువారి కూలీ అందక అవస్థలు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. వారానికోసారి బిల్లులు వేతనాలు కూలీల ఖాతాలలో పడాల్సి ఉండగా నేటికీ పడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కూలీలు తెలుపుతున్నారు. వీరు గ్రామీణ ప్రాంతాలలో చేపల చెరువులు తయారు చేయుట, వరదల నివారణ కట్టలు ఏర్పాటు చేయుట కొత్త కట్టల నిర్మాణం, మామిడి తోటలలో నీరు నిల్వ ఉండేందుకు ఉపాధి హామీ పనులు చేపట్టడం జరిగింది. ఈ విషయమై ఉపాధి హామీ ఎపిఓను వివరణ కోరగా ఏప్రిల్ 13 నుంచి కూలీలకు ఖాతాలలో నగదు జమ కాని మాట వాస్తవమేనని హేమమాలిని తెలిపారు.

# పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందని పిండిప్రోలు పాఠశాల హెచ్‌ఎం ఎంవిఎన్ జ్యోతి అన్నారు. విద్యార్థుల తలిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించడం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు కాకుండా ప్రభుత్వమే యూనిఫామ్‌తో పాటు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా అందిస్తుందని తెలిపారు. మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు మండల పరిధిలోని ఏదులచెరువు, బిస్‌రాజ్ పల్లి తండా, బలరాం తండా, రమణ తండా, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలంలోని కాశిరాజుగూడెం గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించడం ద్వారా మెరుగైన విద్యతో పాటు వారి భవిష్యత్ పునాదులు వేసిన వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసి, లలితకుమారి పాల్గొన్నారు.

# కిష్టయ్య బంజర వాసికి డాక్టరేట్



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్య బంజర గ్రామానికి చెందిన కావేటి గోపాలరావు, జయమ్మ కుమారుడైన కావేటి రామకృష్ణకు జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వవిద్యాలయం హైదరాబాద్ నుండి ఫార్మసీ విభాగంలో డాక్టరేట్ తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ వర్మ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కల్లూరు మండల వాసి కావటి రామకృష్ణను మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి మనోహర్ రెడ్డి, దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ గోపాలస్వామి, ఉపాధ్యాయులు ఈశ్వర్ రావు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మేకల ప్రసాద్, తోట జనార్ధన్ లు వారిని అభినందించారు.

# సిపిఐ హవేలీ ఏరియా కార్యదర్శిగా గాంధీ

### -సహాయ కార్యదర్శులుగా ఆర్‌కె, జాకీర్







**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖానాపుర హవేలీ ఏరియా కార్యదర్శిగా ఏనుగు గాంధీ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా నానబాల రామకృష్ణ (ఆర్‌కె), జాకీర్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. ఏనుగు గాంధీ అఖిల భారత యువజన సమాఖ్య మధిర డివిజన్ నాయకులుగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. గత దశాబ్ద కాలంగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా, హవేలీ ఏరియా కార్యదర్శిగా పని చేస్తున్నారు. సహాయ కార్యదర్శిగా ఎన్నికైన నానబాల రామకృష్ణ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పనిచేస్తుండగా జాకీర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి జిల్లా నాయకులుగా ఉన్నారు. 22 మందితో ఖానాపురం హవేలీ ఏరియా కౌన్సిల్‌ను తొమ్మిది మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా గాంధీ మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి విస్తృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాలకుల తీరు ఎన్నికల ముందు ఒక విధంగా ఎన్నికల తర్వాత మరో విధంగా ఉందని తెలిపారు. ప్రజలు హామీలను నమ్మి మోసపోతున్నారన్నారు. హామీల అమలు కోసం సిపిఐ నేతృత్వంలో పోరాడతామన్నారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఉన్న ఖానాపురం హవేలీ ఏరియాలో పలు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

# సిపిఐ నాయకులపై కేసు కొట్టివేత



**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్ సహా సిపిఐ నేతలపై 2023 లో పెట్టిన కేసును మంగళవారం ఖమ్మంలోని ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. 2023 లో ఖమ్మం రూరల్ మండలం దారెడు గ్రామంలో సిపిఐ కార్యకర్తలు సమావేశం నిర్వహించి అప్పటి పాలేరు శాసనసభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డిపై దాడికి ప్రయత్నం చేశారని ఖమ్మం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం న్యాయస్థానం కందాళ ఉపేందర్‌రెడ్డిపై దాడికి కుట్ర చేశారనడానికి ఎటువంటి సాక్ష్యం లేదని కోర్టు కేసును కొట్టివేస్తున్నట్లు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ అధికార అహంభావంతో తమ పార్టీ క్యాడర్‌ను భయపెట్టేందుకు అక్రమ కేసులు పెట్టారన్నారు. న్యాయస్థానం ఎదుట నిజం నిర్ధారణ అయిందని ఆయన తెలిపారు. ఆధారాలు లేకుండా కేవలం పార్టీపై కక్షతో కేసులు పెడితే ఇటువంటి తీర్పులే వస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే పార్టీ సిపిఐకి దాడులు చేయాల్సిన అవసరం లేదని మరోసారి స్పష్టం చేస్తున్నామని కమలాకర్ తెలిపారు.ఈ కేసులో మాజీ దారెడు సర్పంచ్ బత్తిని సీతారాములు, సిపిఐ నాయకులు సొంటి అశ్వద్ధామ, నూర్‌షా, ఎస్‌కె జిలానీ, ఎస్‌కె షంషుద్దీన్‌లను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

# బడిబాట స్వచ్ఛంద ప్రచార బైక్ యాత్రను ప్రారంభించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండలం చెన్నూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంతాల సుధాకర్ చేపట్టిన బడిబాట ప్రచార బైక్ యాత్రను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని సత్యనారాయణ లు ప్రారంభించారు. స్వచ్ఛందంగా గత నాలుగు సంవత్సరాల నుంచి బడిబాట బైక్ యాత్రను చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడమే కాక తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వం అందించే సౌకర్యాలను తెలియజేసి ఊరూరా కరపత్రాలు పంపిణీ ప్రచారం, ఆట పాటలతోబాటలతో కూడిన ఒత్తిడి లేని గుణాత్మక విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుడిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి నివేదిత, పిఆర్టియు అధ్యక్షులు పాకాల రమేష్, ఉపాధ్యాయులు అప్పారావు, చక్రవర్తి లు పాల్గొన్నారు.

# తొలిరోజు రైతుసదస్సు ప్రశాంతం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతుసదస్సు కార్యక్రమం తొలిరోజు మండల పరిదిలోని తనికెళ్ల, అమ్మపాలెం గ్రామాల్లో నిర్వహించారు. తనికెళ్లలో రైతుసదస్సు కార్యక్రమానికి భారీ స్పందన వచ్చింది. రైతులు పలురకాల సమస్యలపై పెద్ద ఎత్తున హాజరయ్యారు. తనికెళ్లనుంచి వివిద సమస్యలపై 290 ధరఖాస్తులు రాగా అమ్మపాలెం గ్రామంలో 96 ధరఖాస్తులు వచ్చాయి. రైతుసదస్సు కార్యక్రమం అయిపోయిన తర్వాత ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్‌చార్జ్ తహశీల్దార్ రాము తెలిపారు. ఈకార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# యుపిహెచ్‌సిని సందర్శించిన డిఎంఅండ్‌హెచ్‌వో



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్‌లో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి)ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. కళావతిబాయి మంగళవారం పరిశీలించారు. యుపిహెచ్‌సికి వచ్చిన పేషంట్లతో మాట్లాడారు. వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఫార్మసి, నర్సింగ్ ఆఫీసర్ల రూట్ చార్ట్‌ను పరిశీలించారు. ల్యాబ్ టెక్నిషియన్స్ చేస్తున్న పరీక్షలను పరిశీలించి రికార్డులు పరిశీలించారు. ఆశా డే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ వానాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశాలు, ఏఎన్‌ఎంలకు సూచించారు. జూన్ నుంచి నవంబర్ వరకు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. డ్రైడే కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, మెడికల్ ఆఫీసర్ శ్రేష్ట, బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకొని రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి కె అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆళ్లపల్లి రైతు వేదిక నందు ఆళ్లపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన ప్రతి 3 మంది రైతులకు డబ్ల్యూజీఎల్ 44 వరి విత్తనం, ఎంజీజీ 295 పెసర విత్తనం పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల రావూరి విజయ వంశీ, వ్యవసాయ విస్తరణ అధికారి బొడ విజయ్, రాయిపాడు ఎఫ్‌పీవో డైరెక్టర్స్ పెండకట్ల పాపారావు, కిసాన్ సెల్ అధ్యక్షులు మోకాళ్ల శేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు విత్తనాలు తీసుకునే సమయంలో అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ సూచించారు. మండల కేంద్రం లోని రైతు వేదిక లో సిద్ధి విత్తనాల ను 43 మంది రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. సీజన్ ప్రారంభమైనందున్న విత్తనాలు కొనుగోలు సమయంలో ప్రభుత్వం అనుమతి పొందిన విత్తనాలనే తీసుకోవాలని అన్నారు. కొనుగోలు సమయంలో తీసుకునే ప్రతీ వస్తువు రశీదు తీసుకోవాలని అన్నారు. రశీదులను భద్రపరచాలని సూచించారు. ఫర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణాలలో ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయిని హెచ్చరించారు. రైతులకు 50 శాతం సబ్సిడీ పై మండలం లోని రైతులకు 783 క్వింటాల జీలుగులు, 54 క్వింటాలు జనుము,5 క్వింటాల పిల్లి పెసర విత్తనాలు మంజూరు P చేసినట్లు తెలిపారు. రైతులు ఫార్మర్ ఐడీ కోరకు వెంటనే నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లు అవినాష్, అరవింద్, భవాని, శశిరేఖ, శిరిషా, రైతు ప్రతినిధులు గుండా బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# ఐటిఐ కోర్సులలో ప్రవేశాలు



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధి, శిక్షణ విభాగం ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేటు, మైనార్టీ ఐటిఐలు, ఆధునిక సాంకేతిక కేంద్రాలలో ఆగస్టు 2025 సేషన్‌కు ఐటిఐ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభించబడ్డాయని కృష్ణసాగర్ ఐటిఐ ప్రిన్సిపాల్ ధర్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిఐలో ప్రవేశానికి 10 వ తరగతి, ఎనిమిదో తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు 01 ఆగస్టు 2025 నాటికి కనీసం 14 సంవత్సరాలు వయసు కలిగి ఉండాలని, గరిష్ట వయోపరిమితి లేదని, అన్ని అసలు సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు ఒకే దరఖాస్తు ద్వారా రాష్ట్రంలోని ఏదైనా ఐటిఐ, ఏటీసీకు వెబ్ ఆప్షన్ల ద్వారా ఎంపిక అయ్యే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తు చేసే విధానం వెబ్సైట్ ఐటిఐ.తెలంగాణ.జీవోవి.ఇన్ ద్వారా ఈనెల 02వ తేదీ నుండి 21వ తేదీ వరకు చేసుకోవాలని, దరఖాస్తు ఫీజు 100రూపాయలు ఉంటుందని, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడి తప్పనిసరిగా ఇవ్వాలని, దరఖాస్తుల్లో ఇచ్చిన సమాచారం మారితే సీటు రద్దు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. రిజర్వేషన్ నిబంధనల ప్రకారం, వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయించబడతాయని, ఎంపికైన అభ్యర్థులకు రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వబడుతుందన్నారు. అభ్యర్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని తగిన ధృవపత్రాలతో తొందరగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ ఐటిఐ కృష్ణసాగర్ ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలని అన్నారు.

# భూభారతి చట్టంతోనే భూ సమస్యల పరిష్కారం

## స్నానాల లక్ష్మీపురంలో భూభారతి రెవెన్యూ సదస్సు



ప్రజాపక్షం/వైరా: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సును స్నానాల లక్ష్మీపురంలో వైరా తహశీల్దార్ కెవి.శ్రీనివాసరావుల ధ్యక్షతన జరిగిది. భూభారతి చట్టంతో అనేక రకాల రైతులకు సమస్యలు పరిష్కారం అవుతాయని లక్ష్మీపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ అన్నారు. భూమి హక్కుల సమస్యల పరిష్కారం కోసం గ్రామానికి అధికారులు రావడంతో వివిధ రకాల భూ సమస్యలతో 31 మంది ప్రజల నుండి సమస్యలపరిష్కారం కోసం దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తు రశీదును అందించారు. ఆగస్ట్15లోగా భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్లు శ్రీకాంత్, విక్రమ్, పంచాయతీ కార్యదరిశ ఆర్.భారతి, వైరా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, స్నానాల లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ మల్లు రామకృష్ణ, అడుసుమల్లి గణేష్, మల్లు పట్టయ్య, నూతి వెంకటేశ్వరరావు, చిట్టోజి వెంకటాచారి, తాళ్లూరి పుల్లారావు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులుపాల్గొన్నారు.

# మద్యం మత్తులో వీరంగం

## అర్ధ నగ్నంగా రోడ్డుకు అడ్డంగా పడుకుని హల్చల్

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మద్యం మత్తులో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. అర్ధ నగ్నంగా రోడ్డు పై పడుకుని హల్చల్ చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మండల కేంద్రంలో ఓ వైన్స్ షాపు సమీపంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో కూసుమంచినేలకొండపల్లి రహదారి పై హల్చల్ చేశాడు. అర్ధనగ్నం గా ప్రదర్శన చేస్తూ, రహదారి పై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు అడ్డుగా వచ్చి వీరంగం సృష్టించాడు. దాదాపు గంటన్నర పాటు ప్రయాణికులను ఇబ్బంది పెట్టాడు. రోడ్డు పై అరుపులు, కేకలతో పరుగులు పెట్టటంతో పాటు, తనను కొంత మంది ఇబ్బంది పెడుతున్నారని, పలువురు పేర్లు చెబుతూ, రోడ్డు పై పడుకుని రాకపోకలకు ఆటంకం కలిగించటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : భూ భారతి చట్టానికి సంబంధించి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని 15వ డివిజన్ కార్పొరేటర్ రావూరి కరుణ సైదుబాబు తెలిపారు. మంగళవారం ఖమ్మం అర్బన్ పరిధిలోని ధంసలాపురం రెవెన్యూకు సంబంధించి 15వ డివిజన్ అల్లీపురం రైతు వేదిక నందు భూ భారతి చట్టం సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధరణి వల్ల పలు భూ సమస్యలు పరిష్కారం కాలేక పలువురు రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని నూతనంగా తీసుకు వచ్చిందన్నారు. పరిష్కారం కాని భూ సమస్యలకు అవకాశం కల్పించిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖమ్మం అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించారు.ఈ సదస్సులో పలువురు రైతులకు సంబంధించిన భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి రశీదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వహీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ సభ్యులు దేవా మృతి

ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలం కాస్రాతండాకు చెందిన సిపిఐ సీనియర్ సభ్యులు భూక్యా దేవా మంగళవారం తెల్లవారు జామున మృతిచెందారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐలో ఆయన సీనియర్ సభ్యులుగా ఉన్నారు. మండల నాయకునిగా వివిధ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కాస్రాతండా గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులుగా పనిచేశారు. దేవా మృతిపట్ల పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి , సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు పగిళ్ల వీరభద్రం, దరావత్ మంగ్యానాయక్, ఏలూరి భాస్కర్‌రావు, అజ్మీర కిషన్, హరిబాబు, సిపిఎం నాయకులు భూక్యా వీరభద్రం, నంద్రప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

# ఇందిరమ్మ ఇళ్లు పనులు వేగిరం చేయాలి



ప్రజాపక్షం/ఇల్లెందు: పురపాలక పరిధిలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు అందించిన అధికారులు, కమిటీ సభ్యులు గృహాలు త్వరితగతిన నిర్మాణం చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. స్థానిక పురపాలక కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ పథకం దిగ్విజయంగా ముందుకు సాగాలంటే మీ పాత్ర కీలకమని తెలిపారు. మొదటివిడతలో పట్టాలు అందుకున్న లబ్ధిదారులుచే సాధ్యమైనంత త్వరగా గృహాలు నిర్మింపజేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగితేనే పథకం సత్ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ఈ సమావేశంలో గృహ పీడీ శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరున మెగా రక్తదాన శిబిరం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : తలసేమియా చిన్నారుల సహాయార్థం శ్రీబాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల ఆరున మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీబాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి మంగళవారం తెలిపారు.ఈనెల ఆరున తన పుట్టినరోజు సందర్భంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల శ్రీబాలాజీ ఎస్టేట్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం జరుగుతుందన్నారు. తలసేమియా బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

**-20 లక్షల ఇళ్లు నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం**
**-మంత్రి పొంగులేటి**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముజ్జుగూడెం, బైరవునిపల్లి, బోదులబండ, నేలకొండపల్లి, చెన్నారం గ్రామాలలో బుధవారం పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. తొలి విడతగా 4.50 లక్షల ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతీనియోజకవర్గంలో 3,500 ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. శిక్ష ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లో ఎవరూ కూడ ఆ భద్రత భావం కు గురికావద్దని సూచించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పేదోడి సొంతింటి కల నెరవేర్చటం ప్రభుత్వం బాధ్యత అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అన్నారు. రైతులకు మద్దతు ధర, బోనస్ ను అందించిన ఘనత ప్రభుత్వం కు దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్వెనపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, భద్రయ్య, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, కె.హనుమంతరావు, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, గోళ్ల శ్రీనివాస్, మరికంటి రమేష్, గండు సైదులు, గోపి ఉపేందర్,కడియాల నరేష్, వేగినాటి లక్ష్మినర్సయ్య, పెద్దపాక సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు మంగళవారం నగరంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్‌లో పీస్ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఖమ్మంజిల్లాలో ప్రతి ఒక్కరు సోదరభావంతో మెలగాలన్నారు. చట్టాన్ని అందరూ గౌరవిస్తూ సాంప్రదాయాలను పాటించాలన్నారు. త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు జరుపుకునే బక్రీద్ పర్వదినం కోసం పోలీస్ అధికారులు అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, అసౌకర్యం కలుగకుండా వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రజలు శాంతియుతంగా, సంతోషంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలని పోలీసులు సహకరించాలని తెలిపారు. ముస్లిం సోదరులు పాల్గొనే సామూహిక కార్యక్రమాల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను నివారించడానికి ఏడు ప్రత్యేక చెక్ పోస్టులను, హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పాడి ఆవులను, లేగ దూడలను క్రయ విక్రయాలు జరపరాదని, ప్రధానంగా నిబంధనలకు విరుద్ధంగా పశువుల అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత సామరస్యానికి భంగం కలిగించేవిధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వివిధ మతపెద్దలు తమ అభిప్రాయాలను వెల్లడించి పోలీసులు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్త చర్యలకు తమ వంతు సహకారాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏసిపి రమణమూర్తి, సిఐలు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్‌బాబు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటే టోర్నమెంట్ విజేతలకు అభినందనలు



**ప్రజాపక్షం/వైరా:** హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్‌లో ఏబిఎస్‌కెవో కరాటే అసోసియేషన్ వైరా కరాటే మాస్టర్ రఘు ఆధ్వర్యంలో 1 గోల్డ్, 3 సిల్వర్, 9 బ్రౌన్ మెడల్‌లు సాధించిన చిన్నారులను వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు అభినందించారు. వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు మాట్లాడుతూ రఘు మాస్టర్ ఆధ్వర్యంలో బాలబాలికలను హైదరాబాద్ తీసుకెళ్లి దగ్గరుండి ఆడించి మన వైరాకు మెడల్ సాధించినందుకు ఏబిఎస్‌ఎవో కరాటే చిన్నగోపతి సైదులు మాస్టర్ రఘును ప్రత్యేకంగా అభినందించారు. గత 13 సంవత్సరాలుగా రఘు పిల్లలకు కరాటే నేర్పుతూ పిల్లలను ఉత్తేజపరుస్తూ పిల్లలు శారీరకంగా మానసికంగా ధృడంగా ఉండాలని మంచి సంకల్పంతో రఘు ఉచిత కరాటే క్లాసులు చెబుతూ ఉన్నారు. తను చెప్పిన క్లాసులు నేషనల్ వరకు వెళ్లడం అందులో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, ముమ్ముందు మరెన్నో నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనాలని వైరాకి మంచి పేరు తేవాలయి రఘుని ప్రత్యేకంగా కోరారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ రఘుతో పాటు మాస్టర్ గోపి, చిన్నారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రమాదవశాత్తు గాయపడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా మార్కెట్ ఆవరణలో ఉన్నటువంటి పాత వాటర్ ట్యాంక్‌ను కూల్చే పని చేపట్టారు. ఆ పనులకు వచ్చిన కార్మికుడు తమ్మిశెట్టి చిరంజీవి (32) వాటర్ ట్యాంక్ కూల్చే క్రమంలో రాళ్లు మీదపడి గాయపడ్డాడు. వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిరంజీవి మృతితో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

# ఆదర్శ రైతులకు విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/ బోనకల్ :** తెలంగాణ ప్రభుత్వం నాణ్యమైన విత్తనం నేస్తం పథకంలో భాగంగా బోనకల్ మండలంలోని ఆదర్శ రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ ఎఓ విజయ భాస్కర్‌రెడ్డి, ఎఇఓ ఎస్‌కె. హుస్సేన్ ఆదర్శ రైతులకు విత్తనాలు పంపిణీ చేయటం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం ద్వారా ఎంపిక చేసిన విత్తనాలను రైతులకు అందించటం జరుగుతుందని తెలిపారు.

# రేచర్ల సత్యం దంపతులకు పట్టు వస్త్రాలు అందించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రేచర్ల సత్యం తేనేటి విందులో పాల్గొన్నారు. ఇటీవల రేచర్ల సత్యం నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి రాలేకపోయిన మంత్రి పొంగులేటి ఆయన నివాసానికి వెళ్లి పట్టు వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపాల్ మాజీ చైర్మన్ జైపాల్, మిట్టపల్లి నాగి, దార్న రాజశేఖర్, మోహన్‌రెడ్డి, రేచర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని దంపతులను సన్మానించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ సుందరయ్యనగర్‌లో తన స్నేహితుడు రిటైర్డ్ అసిస్టెంట్ ఇంజనీర్ బొగ్గుల వెంకట రామిరెడ్డి నివాసంలో తేనేటి విందులో పాల్గొన్న రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల గృహ నిర్మాణ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదవివిరమణ పొందిన బొగ్గుల వెంకట్రామిరెడ్డిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఇల్లెందు:** తెలంగాణ నిర్మాణ సైనికుడు, మాజీ మంత్రి, తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను అభిమాని అజ్మీరా భావ్‌సింగ్ నాయక్, బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఇల్లెందుమహబూబాబాద్ రహదారి వద్ద సువర్చల సహిత అభయాంజనేయ స్వామి ఆలయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆయురారోగ్యాలతో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారీ కేక్‌ను కత్తిరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సిలివేరు సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ జేకేశ్రీను, టీబీజీకేఎస్ నాయకుడు ఎస్.రంగనాథ్, పట్టణ ఉపాధ్యక్షులు అబ్దుల్‌నభీ, జబ్బార్, గిన్నారపు రాజేశ్, సాతల హరికృష్ణ, కాసాని హరిప్రసాద్, కడగంచి వీరస్వామి, ఎస్.కె.చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి




**ప్రజాపక్షం/ఇల్లెందు:** ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్రప్రభుత్వం చర్చలు జరపాలని సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవునూరి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొమరారంలో మంగళవారం మండల కార్యదర్శి పొడుగు నర్సింహారావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ సదస్సులో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను, మావోయిస్టులను హతమారుస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ఈనెల14న హైదరాబాద్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఆల్‌ఇండియా ట్రైబల్ ఫారం రాష్ట్ర కన్వీనర్ సూర్ణపాక నాగేశ్వరావు, జిల్లా కన్వీనర్ మోకాళ్ల రమేశ్, జిల్లా నాయకుడు యదళ్లపల్లి సత్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.